## సర్కారీ సాయుధ ముఠాలకు వ్యతిరేకంగా

# జాతీయ సదస్సును జయప్రదం చేయండి



## సదస్సు

**మే 19 (శనివారం) ఉదయం 10 నుండి**

**సాయంత్రం 5 గం.వరకు**

## అధ్యక్షత

కె.జి.కన్నబిరాన్

## వక్తలు

రాజిందర్ సచార్ (రిటైర్డ్ చీఫ్‌జస్టిస్, ఢిల్లీ హైకోర్టు),

డి.కె.బసు (రిటైర్డ్ జడ్జి, కలకత్తా హైకోర్టు)

పి.ఎ.సెబాస్టియన్ (సిపిడిఆర్, ముంబాయి)

సుజాతోభద్ర (ఎపిడిఆర్, కలకత్తా)

## స్థలం

ఎ.వి.కాలేజి, దోమల్‌గూడ, హైదరాబాద్.

ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం బాధ్యులు పురుషోత్తం, ఆజం ఆలీల దారుణమైన హత్య ఒక క్రూరమైన వాస్తవాన్ని సమాజం ముందు ఉంచింది.

ఈ వాస్తవం కాశ్మీరు, అస్సాం, నాగాలాండ్ వంటి రాష్ట్రాలలో జనానికిప్పటికే సుపరిచితం.

ఆయుధాలు పట్టుకొని తిరిగేవాళ్లు, దోపిడీలూ దొంగతనాలూ చేసేవాళ్లు అన్ని చోట్లా ఉంటారు. పోలీసు యంత్రాంగం వాళ్లను అదుపు చేసే బదులు వాళ్లతో లాలూచీ పడడం కూడా అసాధారణం కాదు.

కానీ పోలీస్ యంత్రాంగానికి అనుబంధంగా ప్రైవేట్ సాయుధముఠాలు ఉండడం, వారితో పోలీసులు భుజాలు రాసుకొని తిరగడం, వారి నేరాలకు కవచంగా వ్యవహరించడం సులభంగా మింగుడుపడగల విషయం కాదు. భారతదేశమొక ప్రజాస్వామ్యమన్న నమ్మకంతో అతికే విషయం కాదు.

ఇది కాకతాళీయంగా- అంటే కేవలం కొందరు పోలీస్ అధికారుల తప్పుడు నడవడిక కారణంగా- జరుగుతున్నట్టయితే మనం మొత్తంగా పోలీసు యంత్రాంగాన్ని తప్పు పట్టలేకపోవచ్చు, దానిని నడిపే ప్రభుత్వాన్ని తప్పుపట్టలేకపోవచ్చు.

కానీ ఇది పైస్థాయి అధికారుల అనుమతితో సాగుతున్న వ్యూహం. 'నకిలీ నక్సలైట్' శ్రీనివాస్ వ్యవహారం, మాజీ నక్సలైట్ కత్తుల సమ్మయ్య వ్యవహారం ఈ విషయాన్ని స్పష్టం చేశాయి.

### నిర్బంధాన్ని ప్రైవేటీకరించే వ్యూహం

మిలిటెంట్ రాజకీయ ఉద్యమాలు నడుస్తున్న అన్ని ప్రాంతాలలోనూ ఈ వ్యూహాన్ని మన పాలకులు అనుసరిస్తున్నారు. ఇది నిర్బంధాన్ని ప్రైవేటీకరించే వ్యూహం. పోలీసులూ ఇతర ప్రభుత్వ సాయుధ బలగాలూ ప్రయోగించే అణచివేత సమాజంలో విమర్శను ఎదుర్కొనే కొద్దీ, 'తమపని' ప్రైవేట్ సాయుధముఠాల చేత చేయించడం ప్రభుత్వ బలగాలకు ఒక సులువయిన ప్రత్యామ్నాయం అయింది. పోలీసులు ఎవరినైనా చంపితే అది చట్టబాహ్యమైన హత్యాకాండగా ఛీత్కారానికి గురువుతుందిగానీ, పౌరులలోనే ఒకరు మరొకరిని చంపితే 'పాపం పోలీసులు ఏం చేయగలరు?- అన్ని శవాలనూ మార్చురీకి తరలించడం తప్ప?' అని సమాజం అనుకోగలదు.

ఈ వికృతమైన వ్యూహానికి తగిన వ్యక్తులెవరో కూడా ప్రభుత్వబలగాలు గుర్తించాయి. ఆ మిలిటెంట్ పోరాటాలలో ఒకప్పుడు భాగంగా ఉండి బయటికొచ్చి వాటికి శత్రువులుగా మారిన వారిని వాడుకుంటున్నారు. ఉద్యమకారులుగా ఉండి ఉద్యమద్వేషులుగా మారిన వారు అణచివేత వ్యూహానికి చాలా అనుకూలమైన సాధనం అని మన పాలకులు గుర్తించారు. ఉద్యమాల పట్ల ద్వేషం, ఉద్యమకారుల గురించి సమాచారం, వారితో సమానమైన తెగింపు- అన్నీ ఉన్నవాళ్లు పోలీసులకూ సైన్యానికీ ఇంకెక్కడ దొరుకుతారు?

కాబట్టే వాళ్లను చేరదీస్తున్నారు, ఆయుధాలూ జీపులూ ఇచ్చి తమ కనుసన్నలలో మెసలుకునేటట్టు చూస్తున్నారు, తమ ప్రయోజనం కోసం వారు చేసే దోపిడీలను బలవంతపు వసూళ్లను ఇతర నేరాలను చూసీ చూడనట్టు పోతున్నారు, ఉద్యమకారులపైన,

ప్రజాతంత్రవాదులపైన వారి చేత దాడులు చేయిస్తున్నారు, లేదా వారి స్వంత కక్షతో వారు చేసే దాడులను ప్రోత్సహిస్తున్నారు- ఇదీ ఈ వ్యూహం వికృత స్వరూపం.

ఈ దేశ ప్రజలుగా మేము మీ ముందు ఉంచుతున్న ప్రశ్న ఒక్కటే. ఇది ఒక నాగరిక దేశం సహించగల పాలనా వ్యూహమేనా?

ఈ వికృతమైన అణచివేతకు గురి అవుతున్న వ్యక్తులన్నా ఉద్యమాలన్నా మీకు సదభిప్రాయం లేకపోవచ్చు. వారి వల్ల దేశానికి మేలు జరుగుతుందని మీరు అనుకోవచ్చు, లేదా కీడే జరుగుతుందనుకోవచ్చు. ఇక్కడ సమస్య అది కాదు. వారిని ఎదుర్కొనే మిష మీద దేశపాలన ఇంతగా దిగజారవచ్చునా? దానిని ఇంతగా దిగజారనిస్తే అది ఎవరికైనా శ్రేయస్కరమా?- అని ఆలోచించమని కోరుతున్నాము.

ఇప్పటికే మన దేశంలో పోలీసు యంత్రాంగం నిష్పక్షపాతంగా నేరాలను అరికట్టే యంత్రాంగంగా కాక పెత్తందార్ల నేరాలను ఉపేక్షిస్తూ బలహీనుల నేరాలపైన ఉక్కుపాదం మోపే యంత్రాంగంగా తయారయింది. అప్పటి పాలకపార్టీనీ ప్రభుత్వ అధికారులనూ ప్రజల నిరసన నుండి కాపాడే యంత్రాంగంగా వ్యవహరిస్తున్నది. ధర్నాలను భగ్నం చేయడం, ఊరేగింపులను చెదరగొట్టడం, సభలనూ సమావేశాలనూ నిషేధించి అసమ్మతి గొంతు నొక్కేయడం పోలీసుల డ్యూటీ అయిపోయింది.

ఇదే ప్రజాస్వామ్యానికీ ప్రజల ప్రయోజనాలకూ నష్టకరమనుకుంటే, ఆ పోలీసు యంత్రాంగం చెప్పుచేతలలో సాయుధ నేరగాళ్ల ముఠాలు ఉండడం ఇంకెంత ప్రమాదకరమో ఊహించుకోవచ్చు. ఒక ఊరేగింపు తీస్తే పోలీసులు లాఠీలతో చావగొడతారేమోనని భయపడే పరిస్థితి ఉంటే మన నిరసన తెలియచేయడానికి ప్రత్యామ్నాయ మార్గాలు వెతుక్కునే అవకాశమైనా ఉంది. ధర్నా చేస్తే అరెస్టు చేసి జైలులో పెడతారనీ మీటింగ్‌కు హాజరయితే ఉద్యోగం పోతుందనీ భయపడే పరిస్థితి ఉన్నా అంతే. ఈ రకమైన భయం ఉండడం ప్రజాస్వామ్యానికి హానికరమే అయినప్పటికీ భయం ఆ స్థాయిలో ఉంటే ప్రత్యామ్నాయాల గురించి ఆలోచించుకునే అవకాశమైనా ఉంటుంది. కానీ లైసెన్స్‌డ్ హంతకులు విచ్చలవిడిగా తిరిగే చోట అన్ని ప్రత్యామ్నాయాలూ మూసుకుపోతాయి. రోడ్లో, బస్సులో, హోటల్‌లో, సినిమా హాలులో మామూలు మనుషులలాగ కనిపించే వారిలో ఎవడు హంతకుడో, వాడు ఎవరిని చంపడం కోసం సంచరిస్తున్నాడో తెలియని పరిస్థితి ఉంటే- ఏ నిముషం ఎక్కడి నుండి ఒక తల్వార్ వచ్చి మీద పడుతుందో తెలియని పరిస్థితి ఉంటే- పాలకుల గొంతు తప్ప తక్కిన అన్ని గొంతులూ మూగబోవలసిందే.

క్రిమినల్స్‌గా మారిన మాజీ నక్సలైట్లతో తన ప్రభుత్వానికీ పోలీసు యంత్రాంగానికీ ఏమీ సంబంధం లేదని రాష్ట్ర హోం మంత్రి ఒక పక్క దబాయిస్తుండగానే కత్తుల సమ్మయ్య కొలంబోలో దుర్మరణం పాలయి గుట్టు రట్టు చేశాడు. ముఖ్యమంత్రి, హోంమంత్రి కొంత తబ్బిబ్బయి 'అతనికి పాస్‌పోర్ట్ ఎవరిచ్చారు? దీనికి బాధ్యులెవరు?' అంటూ కన్నెర్ర చేశారుగానీ ఏ నటనా అక్కరలేదనుకున్న పోలీసు ఆఫీసర్లు 'మా యిష్టం, మేము ఇచ్చాము, ఇస్తాము' అని దబాయించడం ప్రజలు గమనించే ఉంటారు. 'నకిలీ నక్సలైట్' శ్రీనివాస్‌కు పోలీస్ అధికార్లతో ఉన్న సంబంధాల గురించి రంగాచారి కమిషన్ అనే విచారణ కమిషన్‌ను వేశారుగానీ ఆ అధికారులలో ఒక్కరినీ సస్పెండ్ చేయలేదు. వాళ్లేం చిన్నచితక జవాన్లు కారు... ఎస్‌పి, డిఐజి, ఐజి ర్యాంకు అధికార్లు. వాళ్లు పదవులలో ఉంటే విచారణలో బయటపడేదేమీ ఉండదు. కాబట్టే ప్రభుత్వం ప్రకటించిన విచారణ నుండి ఏ ఫలితమూ రాదని నిస్సందేహంగా చెప్పవచ్చును.

పాలన ఈ స్థాయికి దిగజారడం అనాగరికం అని ప్రజాసామాన్యం ఛీత్కరించుకున్నప్పుడు ఇది ఆగుతుందిగానీ ప్రజాభిప్రాయాన్ని మెప్పించడం కోసం జరిపించే విచారణల తంతుతో ఏమీ ఒనగూడదు. ఆ లక్ష్యంతో దేశంలోని భిన్న రాష్ట్రాలకు చెందిన హక్కుల సంఘాలు 'సర్కారీ సాయుధ ముఠాల వ్యతిరేక ఉద్యమం' (Campaign Against State Sponsored Armed Gangs) అనే వేదికను ఏర్పాటు చేశాయి. ఈ ముఠాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ప్రచురించడం, దేశవ్యాపితంగా ప్రచారం చేసి ఈ విషయంలో బలమైన ప్రజాభిప్రాయాన్ని కల్గించడం ఈ ఉద్దేశ్యం లక్ష్యం.

అందులో మొదటి కార్యక్రమంగా మే నెల 19వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే సదస్సుకు అందరినీ ఆహ్వానిస్తూ-

**-సర్కారీ సాయుధ ముఠాల వ్యతిరేక ఉద్యమం**

**Campaign Against State Sponsored Armed Gangs**

**సిపిడిఆర్ (ముంబాయి), లోక్‌షాహి హక్ సంఘటన (మహరాష్ట్ర), ఎపిడిఆర్ (ప.బెంగాల్), పిడిఎఫ్ (కర్నాటక), పియుడిఆర్ (ఢిల్లీ), పియుసిఎల్, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం, మానవహక్కుల వేదిక (ఆంధ్రప్రదేశ్).**

జాతీయ సదస్సు